'మున్సిపల్'లో జేఏ హల్‌చల్

● ఆరు నెలలుగా ఎలాంటి విధులు లేకుండా ఖాళీగానే..
● జూనియర్ అసిస్టెంట్‌తో సిబ్బంది అవస్థలు
● ఉన్నతాధికారులకు ఫిర్యాదు


చాంబర్‌లో జూనియర్ అసిస్టెంట్ దిలీప్ ఏర్పాటు చేసుకున్న కుర్చీ

మహబూబాబాద్: చేసే ఉద్యోగాన్ని బట్టి కుర్చీలు ఉంటాయి. కానీ జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం చేసే వ్యక్తి తన కుర్చీ ఏర్పాటు విషయంలో కాంప్రమేజ్ కాకుండా కమిషనర్ కంటే ఖరీదైన పెద్ద కుర్చీ ఏర్పాటు చేసుకున్నాడు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌లాగా హడావుడి చేస్తున్నాడు. దీంతో అతని వ్యవహారంపై సంబంధిత కమిషనర్‌తో పాటు ఉన్నతాధికారులకు ఇటీవల ఫిర్యాదు చేసినట్లు సమాచారం. మానుకోట మున్సిపాలిటీ కార్యాలయంలో క మిషనర్‌తో పాటు, మేనేజర్, ముగ్గురు సీనియర్, ఏడుగురు జూనియన్ అసిస్టెంట్లు, ఒక జేఏఓ, సీనియర్, ఇద్దరు జూనియర్ అకౌంటెంట్లు, అరుగురు బిల్‌కలెక్టర్లు, 22 మంది వార్డు ఆఫీసర్లు పని చేస్తున్నారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో టీపీఓతో పాటు ఇద్దరు టీపీఎస్‌లు, ఇంజనీరింగ్ విభాగంలో డీఈఈతో పాటు ఇద్దరు ఏఈలు పని చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కొంతమంది అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు.

జూనియర్ అసిస్టెంట్ దిలీప్ నిర్వాకంతో

మున్సిపాలిటీ కార్యాలయం నేటికి మానుకోట జీపీగా ఉన్న సమయంలో నిర్మాణం చేసినా పాత భవనంలోనే కొనసాగుతోంది. జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న దిలీప్ మాత్రం ఖరీదైన పెద్ద కుర్చీని ఏర్పాటు చేసుకున్నాడు. తాను కమిషనర్ కుర్చీ కంటే పెద్దగా ఉండాలనుకున్నాడు. ఆ విషయంలో సిబ్బంది తనతో వాగ్వాదం చేసినట్లు వారు తెలిపారు. ఏప్రిల్ 30 వరకు కమిషనర్‌గా విధులు నిర్వర్తించిన రవీందర్ ఉద్యోగ విరమణ పొందాడు.

ఆరు నెలలు ఖాళీగానే :

జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున దిలీప్ ఆరు నెలలుగా ఎలాంటి విధులు లేకపోవడంతో ఖాళీగానే ఉంటున్నారని సిబ్బంది తెలిపారు. ఇటీవల బయోమెట్రిక్ మిషన్‌తో కాకుండా మ్యానువల్‌గా హాజరు పట్టికలో నిర్వహిస్తున్నారు. దీంతో తనకు ఇష్టం వచ్చినట్లు హాజరుపట్టికలో సంతకాలు చేసి ఇష్టమొచ్చిన సమయంలో వెళ్లిపోతున్నారు. ఎవరినీ కూడా లెక్కచేయకుండా ఇబ్బంది పెడుతున్నారని సిబ్బంది చెబుతున్నారు.

ఇన్‌చార్జ్ కమిషనర్‌తో..

ఏప్రిల్ 30న కమిషనర్‌గా పని చేసిన నోముల రవీందర్ ఉద్యోగ విరమణ పొందగా అదే రోజు సాయంత్రం వరంగల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న టి.రాజేశ్వర్‌కు కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించారు. ఆయన వారానికి ఒక్క రోజు మాత్రమే వస్తుండడంతో ఆ జూనియర్ అసిస్టెంట్ దిలీప్ తన వ్యవహారం మితిమీరిపోతుందన్నారు. ఈ విషయంపై కమిషనర్ టి.రాజేశ్వర్‌కు ఫోన్ చేస్తే స్పందించలేదు

కమిషనర్‌కు ఫిర్యాదు

కమిషనర్‌గా పని చేసిన రవీందర్‌కు ఆ జూనియర్ అసిస్టెంట్ వ్యవహారంపై సిబ్బంది ఫిర్యాదు చేశారు. దాంతో ఆరు నెలల పాటు తనకు ఎలాంటి విధులు కేటాయించలేదు. కమిషనర్ రవీందర్ గత నెల 30న ఉద్యోగ విరమణ పొందాడు. కొంత మంది సిబ్బంది ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.
– శ్రీధర్, మేనేజర్

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ


ఈజీఎస్ పనుల వివరాలను పరిశీలిస్తున్న అధికారులు

చిన్నగూడూరు : ఎంపీడీఓ కార్యాలయంలో నాలుగో విడత ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్ర జావేదిక శుక్రవారం నిర్వహించారు. మండల పరిధిలోని పది గ్రామ పంచాయతీల్లో సోషల్ ఆడిట్ బృందం వారం రోజులుగా పర్యటించి ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనులను తనిఖీ చేశారు. పనులకు సంబంధించిన వివరాలను రికార్డులను అధికారులు పరిశీలించి నివేదికను ప్రజావేదికలో చదివి వినిపించారు. ఏడాది కాలంగా రూ. 2,62,03,583 జరిగిన పనుల్లో రూ.1,49, 780 లు దుర్వినియోగమైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా డీఆర్‌డీఓ మధుసూదన్ రాజు మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి జాబ్‌కార్డు అందించి తప్పకుండా ఉపాధి పని కల్పించాలన్నారు. ఉపాధి హామీలో చేపట్టిన పనుల్లో అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. దుర్వినియోగం అయిన మొత్తాన్ని రికవరీ చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అంబుడ్స్‌మెన్ బి.ఆదాం, ఎంపీడీఓ రామారావు, ఏపీఓ మాధవి, జీపీ కార్యదర్శులు, ఎఫ్‌ఏలు, మండల ఈజీఎస్ సిబ్బంది, సోషల్ ఆడిట్ బృందం తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసిన వారికే పదవులు


సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

● ఎమ్మెల్యే కోరం కనకయ్య వెల్లడి

గార్ల: పార్టీ బలోపేతం కోసం కష్టపడి పనిచేసిన వారికే కాంగ్రెస్ పార్టీ పదవులు లభిస్తాయని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. శుక్రవారం గార్లలోని కృష్ణతారక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పార్టీ సంస్థాగత నిర్మాణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎమ్మెల్యే, ఎంపీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడి పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం అహర్నిషలు కృషిచేసిన వారిని పార్టీ అధిష్టానం గుర్తించి పార్టీ పదవులు ఇస్తుందన్నారు. పదవుల కోసం దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను గాంధీభవన్ కార్యాలయంలో అప్పచెప్పడం జరుగుతుందన్నారు. పదవుల కోసం ఎవరూ పైరవీలు చేయాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో సంస్థాగత ఎన్నికల రాష్ట్ర అబ్జర్వర్లు మాజీ ఎమ్మెల్సీ పొట్ల నాగేశ్వరరావు, కె రవళిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు జె.భరత్‌చంద్రారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు, గుండా వెంకట్‌రెడ్డి, తాళ్లపల్లి కృష్ణగౌడ్, కట్టా శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ జాటోత్ ఝాన్సీలక్ష్మి, మాజీ ఏఎంసీ చైర్మన్ భూక్యా నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి



నెహ్రూసెంటర్ : ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. పార్టీ పట్టణ ఆర్గనైజేషన్ కమిటీ సమావేశం వీరవెల్లి రవి అధ్యక్షతన శుక్రవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్‌సారథిరెడ్డి మాట్లాడుతూ ఎలాంటి షరతులు లేకుండా ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల్లో ఏళ్ల తరబడి నివసిస్తున్న ప్రతి ఒక్కరికీ పట్టాలు, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కోరారు. సమావేశంలో పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మీ, వెలుగు శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


గార్ల: పెద్దకిష్టాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

గార్ల: ప్రభుత్వ పాఠశాలల్లో సబ్జెక్ట్‌ల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులచే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని పెద్దకిష్టాపురం ఎంపీపీఎస్ హెచ్‌ఎం వీరభద్రం అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పెద్దకిష్టాపురం, అంజనాపురం, చంద్రగిరి గ్రామాల్లో ఇంటింటికి ఉపాధ్యాయలు వెళ్లి తల్లితండ్రులకు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు.

బయ్యారం : ప్రభుత్వ బడిలో నాణ్యమైన విద్య అందుతుందని పిల్లలను ప్రభుత్వ బడిలోనే చేర్పించాలని ఉప్పలపాడు స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాసరావు అన్నారు. బడిబాటలో భాగంగా నర్సాతండా, నాగారం తండాల్లో తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

మైనార్టీ గురుకులంలో నాణ్యమైన విద్య

మహబూబాబాద్ అర్బన్ : మైనార్టీ గురుకులంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించామని మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస అన్నారు. జిల్లా కేంద్రంలో మైనార్టీ గురుకుల అడ్మిషన్లకై ఉపాధ్యాయులు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వందశాతం ముస్లింలకు అడ్మిషన్లను 5 నుంచి 8వ తరగతి వరకు భర్తీ చేయడానికి ఇంటింటి ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నామన్నారు.

బాధితులను ఆదుకోవాలి


గంగారం : అడవిదున్న దాడిలో గాయపడిన వ్యక్తిని పరామర్శిస్తున్న నాయకులు

గంగారం : తునికాకు సేకరణకు వెళ్లిన కూలీలపై అడవి దున్నలు దాడిచేయడంతో తీవ్రంగా గాయపడుతున్నారని, వారిని ప్రభుత్వమే ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ గంగారం, కొత్తగూడ, సంయుక్త మండలాల కార్యదర్శి పూనెం ప్రభాకర్ అన్నారు. గంగారం మండలంలోని కొడిశలమిట్ట గ్రామానికి చెందిన గుంట సూర్యకాంత్ రెండు రోజుల క్రితం తునికాకు సేకరణకు వెళ్లగా అడవిదున్న దాడి చేయడం తీవ్రగాయాలయ్యాయి. ఆయనను శుక్రవారం నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉన్నతాధికారులు జోక్యం చేసుకోని అడవి జంతువుల బారిన పడి గాయపడిన ఆదివాసీ నిరుపేద కుటుంబాలను మెరుగైన వైద్య సేవల నిమిత్తం రూ.లక్ష ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు. ఇటీవల గాలిదుమారం, వర్షం కారణంతో ఆదివాసీ నిరుపేద మహిళ గోగ్గెల్ల జ్యోతి ఇంటి, పై కప్పు పూర్తి ధ్వంసమైందని, వారికి కూడా నష్టపరిహారం అందించాలని కోరారు. మాస్‌లైన్ మహబూబాబాద్ డివిజన్ కమిటీ సభ్యుడు ఈక భిక్షం, ప్రగతిశీల యువజన సంఘం జిల్లా నాయకులు కురుసం సురేష్, బుచ్చిరాములు, లక్ష్మయ్య, సమ్మయ్య, జ్యోతి, లక్ష్మీ, ఉన్నారు.

నెహ్రూసెంటర్ : గంగారం మండలంలో ఇటీవల అడవిదున్న దాడిలో గాయపడిన సూర్యకాంత్‌ను ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించి ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య, తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భూక్య హరినాయక్ శుక్రవారం ప్రభుత్వాన్ని కోరారు.

కొమ్మాలు నాయక్ సేవలు అభినందనీయం


మాట్లాడుతున్న తహసీల్దార్ చంద్రశేఖర్‌రావు

గూడూరు : ఒక నాయకుడిగా గ్రామాభివృద్ధికి పాటుపడుతూ సొంత ఖర్చులతో కోతులను పట్టించి గ్రామస్తుల మన్ననలు పొందడం అభినందనీయమని తహసీల్దార్ చంద్రశేఖర్‌రావు, ఎంపీడీఓ వీరస్వామి అన్నారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో శుక్రవారం జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వాంకుడోతు కొమ్మాలు నాయక్ కోతుల నియంత్రణపై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రెండేళ్లుగా గూడూరు పట్టణ అభివృద్ధికి, గ్రామస్తుల విన్నపం మేరకు సొంతంగా రూ.14 లక్షలతో సుమారు 2500 కోతులను పట్టించి దట్టమైన అడవిలో దింపి రావడం అభినందనీయమన్నారు. అనంతరం ఇటీవల గ్రామంలో తప్పించుకొని తిరుగుతున్న మరో 100 కోతులను బంధించినట్లు చూపారు. అధికారులతో పాటు మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు కొమ్మాలునాయక్‌ను అభినందించారు. మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీపాల్‌రెడ్డి, చంటి స్వామి, రసూల్, సురేందర్, నాగరాజు. గంగయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పేదలకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

కొత్తగూడ : పార్టీల వారీగా కాకుండా అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని సీపీఐ(ఎంఎల్), న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ మండల కార్యదర్శి బూర్క బుచ్చిరాములు తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందచేశారు.

పరామర్శ

చిన్నగూడూరు : మండలంలోని గుండంరాజుపల్లికి చెందిన సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గునిగంటి రాజన్న, జిల్లా కమిటీ సభ్యులు గునిగంటి మోహన్, డోర్నకల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గునిగంటి కమలాకర్ తండ్రి బుచ్చయ్య ఇటీవల మృతి చెందాడు. మాజీ ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు బుచ్చయ్య చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

ఎమ్మెల్యే పరామర్శ

కురవి : మండలంలోని కందికొండ గ్రామంలో ఇటీవల బొడ్డు ఏసురత్నం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జాటోత్ రాంచంద్రునాయక్ బాధిత కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు. మృతుడి చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

గూడూరు: మండలంలోని పొనుగోడు, ఏపూరు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన రైతు బానోతు హచ్చ, పార్టీ నాయకుడి తండ్రి వెంకటాద్రి మృతి చెందాడు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్ వారి కుటుంబాలను పరామర్శించారు.

విద్యార్థినులకు సన్మానం

కురవి: సీరోలు మండలం చింతపల్లి జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతిలో 500 మార్కులకు పైగా వచ్చిన విద్యార్థినులు గడ్డం పూజ, వాంకుడోత్ మహేశ్వరీ, లక్ష్మీప్రసన్నలను హెచ్‌ఎం బానోత్ శంకర్‌నాయక్ శుక్రవారం పాఠశాలలో సన్మానించారు.

గంగారం ఏఓగా వేణు యాదవ్

గంగారం : గంగారం మండల వ్యవసాయాధికారిగా వేణుయాదవ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన రాంబాబు ఖమ్మం జిల్లాకు బదిలీపై వెళ్లారని, ఆయన స్థానంలో వేణుయాదవ్ బాధ్యతలు స్వీకరించారు.

శ్రీరామ ఆలయంలో లక్ష్మీగణపతి యజ్ఞం

మహబూబాబాద్ రూరల్ : జిల్లా కేంద్రంలోని శ్రీ సీతారామచంద్ర స్వామివారి దేవాలయంలో లక్ష్మీగణపతి యజ్ఞం పూజ కార్యక్రమాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఎంవీ.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో సహఅర్చకులు క్ష్మీగణపతి స్వామివారికి పంచామృత అభిషేకం, అలంకరణ, అర్చన పూజలు జరిపారు.

రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి

దంతాలపల్లి : అకాల వర్షాలకు తడిసిన వడ్లు, మిర్చి, మొక్కజొన్న పంటలను ప్రభుత్వమే మద్దతు ధరతో కొని రైతులను ఆదుకోవాలని తెలంగాణ గిరిజన సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు హరినాయక్ అన్నారు. గురువారం రాత్రి కురిసిన అకాల వర్షానికి తడిసిన ధాన్యంను శుక్రవారం మండలంలోని పర్యటించి పరిశీలించారు.

రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కు అందజేత

కేసముద్రం : ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన కొండ యాదమ్మ ఇటీవల ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. ఈ మేరకు విద్యుత్‌శాఖ నుంచి వచ్చిన రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును శుక్రవారం మున్సిపాలిటి కేంద్రంలో కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి బాధిత కుటుంబానికి అందజేశారు.

ఎంపిక పారదర్శకంగా నిర్వహించాలి

బయ్యారం: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా నిర్వహించాలని కోరుతూ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట ఆందోళన చేపట్టారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కుటుంబ సర్వే నిర్వహించిందని ఆ సర్వే ప్రకారం అర్హులైన వారికి ఇళ్లు ఇవ్వాలన్నారు. అర్హులకు న్యాయం చేయాలని కోరుతూ సమస్యలతో కూడిన వినతిపత్రం అధికారులకు అందజేశారు.

అలరించిన బుర్రకథ

డోర్నకల్ : మండలంలోని వెన్నారంలో గ్రామ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ప్రదర్శించిన బుర్రకథ స్థానికులను అలరించింది. శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి చరిత్రను వివరిస్తూ కంఠాయపాలెం గ్రామానికి చెందిన కాకతీయ బుర్రకథా బృందం కళాకారులు కథను ప్రదర్శించారు.

కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలం

నెల్లికుదురు: జాతీయ ఉపాధిహామీ పథకంలో కూలీలకు పనుల వద్ద కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలం చెందారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ యాకూబ్ మండిపడ్డారు. బ్రాహ్మణకొత్తపల్లిలో ని ర్వహిస్తున్న ఉపాధి పనులను శుక్రవారం ఆయన సందర్శించి పరిశీలించారు.

వెంకటయ్య మృతిపట్ల యూటీఎఫ్ నివాళి

మహబూబాబాద్ రూరల్ : రిటైర్డ్ ఉపాధ్యాయులు యూటీఎఫ్ సీనియర్ నాయకులు బూర్గుల వెంకటయ్య అనారోగ్యంతో మృతిచెందగా ఆయన పార్థివదేహానికి యూటీఎఫ్ నాయకులు శుక్రవారం నివాళులర్పించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మల్లారెడ్డి మాట్లాడారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి

నెల్లికుదురు : రైతులు నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని ఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు ఆలకుంట్ల సాయన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశా రు. తహసీల్దార్ కె.రాజుకు శుక్రవారం వినతి పత్రం అందించారు.

సైబర్ కేసు నమోదు

డోర్నకల్ : వాట్సాప్‌లో తనకు వచ్చిన అప్లికేషన్ యాప్‌కు స్పందించి ఖాతా నుంచి డబ్బు పోగొట్టుకున్న వ్యక్తి ఫిర్యాదు మేరకు సైబర్ కేసు నమోదు చేసినట్లు స్థానిక సీఐ బి.రాజేష్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రావిగూడెంకు చెందిన మంద చంద్రయ్య మోదుగగడ్డతండా పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 1న తన సెల్‌ఫోన్‌కు వచ్చిన అప్లికేషన్ యాప్‌కు స్పందించి కొన్ని వివరాలను ఫార్వర్డ్ చేశాడు. వెంటనే చంద్రయ్య బ్యాంకు నుంచి రూ.27,700 మాయమయ్యాయి. చంద్రయ్య 1930 నంబర్‌ను ఫిర్యాదు చేసిన అనంతరం స్థానిక పో లీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఆదివాసీ చట్టాల అమలుపై చైతన్యయాత్ర


మాట్లాడుతున్న బొల్లి సారయ్య

గూడూరు: ఈ నెల 20 నుంచి మహబూబాబాద్ జిల్లా ఆదివాసీ గ్రామాల్లో చట్టాల అమలుపై చైతన్య యాత్ర కొనసాగుతుందని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు బొల్లి సారయ్య అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లిలో శుక్రవారం జరిగిన సంఘం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 5వ షెడ్యూల్ పరిపాలన, రాజ్యాంగ చట్టాల అమలు, ఆదివాసీల హక్కులను వివరిస్తూ గ్రామాల్లో చైతన్య యాత్ర ఉంటుందన్నారు. ఈ యాత్రకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈసం సుధాకర్, డాక్టర్ అరుణ్‌కుమార్, ఉద్యోగ, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సునిల్, రమేష్, మల్లేష్, శ్రీను, సురేష్, రాజేష్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదెల మృతి


బయ్యారం: విద్యుదాఘాతంతో మృతిచెందిన గేదెలు

బయ్యారం : విద్యుదాఘాతంలో మూడు పాడిగేదెలు మృతిచెందిన సంఘటన శుక్రవారం బయ్యారం గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. బయ్యారం గ్రామానికి చెందిన పాండవుల లింగయ్య తన గేదెలను మేతకు ఉదయం వదిలాడు. మేతకు వెళ్లిన గేదెలు వ్యవసాయ పొలంలో ఉన్న విద్యుత్ తీగలకు తగిలి విద్యుత్‌షాక్‌తో మృతిచెందాయి. విద్యుత్‌శాఖ నుంచి నష్టపరిహారం ఇప్పించాలని బాధిత రైతు లింగయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాడు.

మరిపెడ రూరల్: మండలంలోని బావోజిగూడేనికి చెందిన మిడతపల్లి హైమకు చెందిన పాడి గేదె గడ్డి కోసం నీలికుర్తి వరకు వెళ్లింది. అక్కడ గ్రామ సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గడ్డి మేస్తున్న క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు అమర్చి ఉన్న ఎర్త్ వైర్ తగిలి గేదె అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన గొడి గేదె విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందన్నారు.

పిడుగు పాటుకు పాడి గేదె..

నెల్లికుదురు : పిడుగుపాటుకు పాడి గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని మునిగలవీడు గ్రామ శివారు జయ్యారం తండాలో శుక్రవారం చోటు చేసుకుంది. తండాకు చెందిన గుగులోతు బాలు పాడిగేదె ఇంటివద్ద కట్టేసి ఉందన్నారు. గురువారం రాత్రి ఉరుములతో కూడిన పిడుగు పడిందన్నారు. శుక్రవారం ఉదయం చేసే వరకు పాడి గేదె మృతి చెంది ఉన్నట్లు బాధితుడు తెలిపారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి


డోర్నకల్: ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ సాధ్విజ


మహబూబాబాద్ రూరల్‌లో..


దంతాలపల్లిలో:

డోర్నకల్/ మహబూబాబాద్ రూరల్/దంతాలపల్లి: డెంగీ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉంటూ పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని డోర్నకల్, మండల వైద్యాధికారి డాక్టర్ సాధ్విజ కోరారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

డెంగీని తరిమికొడతాం

మహబూబాబాద్ రూరల్ : దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూసుకుందామని, డెంగీని తరిమికొడుదామని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మేరీ అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం డెంగీపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ నరేష్, హెల్త్ సూపర్ వైజర్ పుష్పలీల, తదితరులు పాల్గొన్నారు.

దంతాలపల్లి : డెంగీ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల వైద్యాధికారి చైతన్య అన్నారు. శుక్రవారం ఆస్పత్రి నుంచి అంబేడ్కర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు కవిత, వాణి, అనుషా, చందు, ఎంఎల్‌హెచ్‌పి వెంకటేష్, రేవతి, మమత, హెల్త్ సూపర్‌వైజర్ బీమా, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేగంగా కాంటాలు పెట్టాలి

తొర్రూరు రూరల్: కొనుగోలు కేంద్రంలో పేరుకపోయినా ధాన్యం రాశులను వేగవంతంగా కాంటాలు పెట్టాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు ఆలకుంట్ల సాయన్న డిమాండ్‌చేశారు. శుక్రవారం మండలంలోని మాటేడులోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సాయన్న మాట్లాడుతూ రోజుల తరబడి ధాన్యం రాశులు పేరుకపోవడంతో గాలివానలతో రైతులు ఆందోళనలు చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పంట మార్పిడితో మేలు

డోర్నకల్ : రైతులు తమ భూముల్లో పంట మార్పిడి చేసి సాగు చేస్తే మేలు జరుగుతుందని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త క్రాంతికుమార్ కోరారు. మండలంలోని చిలుకోడు రైతువేదికలో శుక్రవారం నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో క్రాంతికుమార్ మాట్లాడుతూ పంటమార్పు చేస్తూ సాగు చేస్తే రైతులకు అన్ని విధాలా మేలు జరుగుతుందన్నారు. ఆత్మ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి, మరిపెడ ఏడీఓ విజయచందర్, కేవీకే శాస్త్రవేత కిషోర్‌కుమార్, ఏఓ మురళీమోహన్, ఏఈఓ చరణ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పూజలు

నర్సింహులపేట : మండల కేంద్రంలో యాదవుల కులదేవత గంగమ్మ తల్లి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్ ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. నిర్వాహకులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికి సన్మానం చేశారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు

డోర్నకల్: కులం పేరుతో దూషించి దాడి చేసిన వ్యక్తిపై డోర్నకల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదైంది. ఎస్సై గడ్డం ఉమ శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. బూరుగుపాడుకు చెందిన నూనావత్ వెంకన్న గ్రామంలో సెలూన్ షాపు నిర్వహిస్తున్నాడు. గ్రామానికి చెందిన కడియాల సీతారామరాజు వెంకన్నతో గొడవపడి కులం పేరుతో దూషిస్తూ కొడవలితో దాడి చేశాడు. వెంకన్న ఫిర్యాదు మేరకు సీతారామరాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

నర్సింహులపేట: మండలంలోని బక్కతండా గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మాతండాకు చెందిన జాటోత్ చింటు(23) ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. చింటు మద్యానికి బానిసై ఖాళీగా తిరుగుతున్నాడు. అయితే తాగుడు బంద్ చేయాలని కుటుంబ సభ్యులు చెప్పడంతో మనస్తాపానికి చెందిన చింటు వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి వీరన్న ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పీఎస్సై షేక్ ఖాదర్‌పాషా తెలిపారు.

యువతి అదృశ్యం

డోర్నకల్ : మండలంలోని జోగ్యాతండాకు చెందిన యువతి అదృశ్యంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది ఎస్సై గడ్డం ఉమ శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. జోగ్యాతండాకు చెందిన వెన్నెల డిగ్రీ పూర్తి చేసి ఇంటి వద్ద ఉంటుంది. ఈ నెల 11న రాత్రి 11 గంటల సమయంలో కుటుంబ సభ్యులకు చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. అనంతరం తండ్రి లచ్చయ్య పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వివాదాస్పదంగా మారిన గోడ

చిన్నగూడూరు : మండల కేంద్రానికి చెందిన దుంపల శ్రీనివాస్, గాడిపెల్లి సత్యనారాయణ ఇళ్ల మధ్య ఉన్న గోడ కొన్ని రోజులుగా గొడవలతో వివాదాస్పదంగా మారింది. తన స్థలానికి గోడ అడ్డుగా నిర్మించారంటూ సత్యనారాయణ గోడను తొలగించాడు. దీంతో ఇరు కుటుంబాలకు వాగ్వాదం జరిగింది. ఇదే విషయమై ఇరు కుటుంబాలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గోడ కూల్చిన వారిని కాకుండా పోలీసులు తమనే బెదిరిస్తున్నారంటూ దళిత మహిళ సుజాత చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ విషయంపై ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ను వివరణ కోరగా ఇరు కుటుంబాలు గొడవ పడుతున్నారనే సమాచారంతో వెళ్లి ఇరు కుటుంబసభ్యులతో మాట్లాడినట్లు తెలిపారు. ఇరు కుటుంబాల ఫిర్యాదు తీసుకున్నామన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

డోర్నకల్ : మండలంలోని జోగ్యాతండాకు చెందిన ఓ వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందడంపై శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై వంశీధర్ కథనం ప్రకారం జోగ్యాతండాకు చెందిన చాందావత్ శ్రీను (38) హైదరాబాద్‌లో కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మూడు రోజుల క్రితం జోగ్యాతండాకు వచ్చిన శ్రీను జ్వరం బారిన పడి గురువారం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి బావ్‌సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.